# సాక్షి వికారాబాద్

సోమవారం ׀ 4 ׀ ఆగస్టు ׀ 2025




## మరమ్మతు చేపట్టాలి

లక్ష్మీనారాయణపూర్–దేవనూరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మల్కయ్య డిమాండ్ చేశారు. 8లో▸



## ఏం కొనలేం..

కూరగాయల ధరలు పెరుగుతు న్నాయి. దీంతో వినియోగదారుల పరిస్థితి కొనలేం.. తినలేం అనట్టుగా మారింది. 8లో▸



## కేసుల నిర్వీర్యం తగదు

అట్రాసిటీ కేసులను నిర్వీర్యం చేయడం తగదని దళిత ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 9లో▸

## న్యూస్‌రీల్

### నేడు ఇందిరానగర్‌లో వైద్య శిబిరం

తాండూరు టౌన్‌: పట్టణంలోని ఇందిరా నగర్‌లో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి లలితా దేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కడుపులో గడ్డలు, మానసిక సమస్యల వంటి వాటికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. క్యాంపు ఇన్‌చార్జి డాక్టర్ గిరిధర్‌తో పాటు మరికొంత మంది స్పెషలిస్టు వైద్యులు ఈ శిబిరంలో సేవలందించనున్నట్లు చెప్పారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

### రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌ పోటీలు

తాండూరు టౌన్‌: వికారాబాద్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని విభాగాల వయసు క్రీడాకారులకు మంగళవారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మధు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాము ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విలియమ్మూన్ గ్రౌండ్‌లో ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు.అండర్‌–8, 10 విభాగాల్లో బాలబాలికలకు 60 మీటర్ల పరుగు పందెం, బ్రాడ్ జంప్, అండర్‌–12 విభాగంలో 60 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, అండర్‌–14 విభాగంలో జావెలిన్ త్రో, అండర్‌–6,18,20 విభాగాల్లో జావెలిన్ త్రో పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తహసీల్దార్ ధ్రువీకరించిన జనన పత్రంతో రావాలన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నేరుగా రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. వివరాలకు 63000 75229, 99513 43432 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### చంద్రకల్ వాసికి డాక్టరేట్



సరిత

దౌల్తాబాద్‌: మండల పరిధిలోని చంద్రకల్ గ్రామానికి చెందిన దేవయ్య, శకుంతల కుమార్తె సరిత ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీలో ఆదివారం డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో నేల నాణ్యత పెరుగుదలపై అసిస్టెంట్ ప్రొఫెసర్ జయశ్రీ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు వివరించారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా సరితను కుటుంబసభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందించారు.

### బాలేశ్వర్‌గుప్తాకు సత్కారం



బాలేశ్వర్‌గుప్తాను సన్మానిస్తున్న లలితకళా సమాఖ్య ప్రతినిధులు

యాలాల: లలిత కళా సమాఖ్య ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణ కంకణ అవార్డుల సంబురాలను ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవ ఎంపీపీగా బాలేశ్వర్‌గుప్తాకు నిర్వాహకు లు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఈ అవార్డుల కార్యక్రమానికి ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, సినీనటుడు శివాజీ రాజా, జనార్ధన్‌రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలేశ్వర్‌గుప్తా మాట్లాడుతూ.. ఉత్తమ సేవా విభాగంలో భాగంగా తనను గుర్తించడం సంతోషించతగిన విషయమన్నారు.

### పేలిన లారీ టైరు

- అక్కడికక్కడే డ్రైవర్ మృతి
- హనుమకొండ జిల్లా వంగపహాడ్ సమీపంలో ఘటన
- మృతుడు జిల్లా వాసి

హసన్‌పర్తి: టైరును పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు పేలింది. ఈ ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం హనుమకొండ జిల్లా వంగపహాడ్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జిల్లా పరిధిలోని తాండూరుకు చెందిన పి.సాయిలు(40) షాబాద్ బండల లోడ్ లారీతో జాతీయ రహదారిపై ములుగు వైపునకు బయలుదేరాడు. ఈ క్రమంలో వంపగహాడ్ సమీపంలో లారీ ఆపి టైరును పరిశీలిస్తుండగా ఒకేసారి పేలింది. ఈ ఘటనలో సాయిలు అక్కడకక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఫొటోలకు ఫోజులిస్తున్న యువతులు

## పర్యాటక శోభ

కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రాజెక్టు నీటిలో యువత ఆటలాడుతూ సందడి చేశారు. బోటింగ్ చేస్తూ సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ కుటుంబీకులతో వనభోజనాలు చేసి సందడిగా గడిపారు.

– ధారూరు



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

# ఆశలు ఆవరి

ఈ ఏడాది ఖరీఫ్(వానాకాలం) రైతులకు నిరాశే మిగుల్చుతోంది. గతేడాది 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఈ ఏడాది నేటికీ 40 వేల ఎకరాలకే పరిమితమైంది. జిల్లాలో మెజార్టీ స్థాయిలో చెరువులు నిండక.. భూగర్భ జలాలు పెరగక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

### వర్షాభావం కారణంగా భారీగా తగ్గిన వరిసాగు

- నిండని చెరువులు.. పెరగని భూగర్భజలాలు
- నెలాఖరు వరకు సమయం ఉందంటున్న శాస్త్రవేత్తలు
- శాస్త్రీయ పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ సూచన



వికారాబాద్‌: ఈ ఏడాది వరి సాగుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. వర్షాకాలంలో వచ్చిన మార్పులతో ఈ ఏడాది సాగు భారీగా తగ్గే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలోనే అత్యధికంగా పరిగి నియోజకవర్గంతో పాటు వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని ధారూరు, కొడంగల్ పరిధిలోని బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల, తాండూరు పరిధిలోని యాలాల మండలాల్లో వరి అత్యధికంగా సాగు చేస్తారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 93 వేల ఎకరాలు కాగా గత నాలుగేళ్లుగా క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది చెరువుల్లోకి నీరు పూర్తి స్థాయిలో చేరకపోవడంతో గతంతో పోలిస్తే సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో 1,187 చెరువులకు గాను 62 చెరువులు అలుగు పారుతుండగా మరో 194 చెరువులు 75 శాతం నుంచి వందశాతం నిండాయి. మిగతా చెరువులు ఇంకా నిండలేదు. భూ గర్భ జలాలు సైతం పెరగలేదు.

**ఆందోళనలో అన్నదాత**

సరిపడా వర్షాలు కురవక రైతులు వరి నాట్లు వేసుకునేందుకు వెనుకాడుతున్నారు. రైతులంతా నారు పోసుకున్నా సగం కంటే తక్కువ మంది నాట్లు వేస్తున్నారు. బోర్లు ఉన్న రైతులు నాట్లు వేస్తున్నప్పటికీ నీరు అడుగంటడంతో పంటలు పండుతాయా.. ఎండుతాయా..? అని ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం ఈ నెలాఖరు వరకు వరి నాట్లు వేసుకోవచ్చని సూచిస్తున్నారు. తమ సలహాలు, సూచనల మేరకు సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని అవగాహన కల్పిస్తున్నారు.

**శాస్త్రవేత్తల సూచనలు**

- బీపీటీ 5204, ఎంటీయూ 1010, ఎంటీయూ 1001, చిట్టిముత్యాలు తదితర రకాల వరివిత్తనాలు సాగుచేస్తున్నారు.
- సాంబమసూరి, భరణి, కాటన్ దొర సన్నాలు, సోమశిల, సింహపురి, తెలంగాణ సోనా రకాలను వానాకాలం సీజన్‌లో సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయి.
- ఈ రకాలు ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తుంది. యాసంగిలో మరో పది బస్తాల వరకు పెరుగుతాయి.
- ఈ ప్రాంతంలో సాగు చేస్తున్న ఎంటీయూ 1010, ఎంటీయూ 1001 రకాలు యాసంగిలో మంచి దిగుబడులు ఇస్తాయి.
- సెప్టెంబర్ మొదటి వారంలోపు వరినాట్లు వేసుకోవటం మంచిది.

**జాగ్రత్తలు**

- వరి పంటను కాండం తొలుచు పురుగు, ఆకుముడత తెగులు, దోమపోటు, అగ్గితెగులు ఆశించే అవకాశాలు ఎక్కువ.
- కాండం తొలుచు పురుగు నివారణకు నారు మళ్లలో ఒకటిన్నర కిలోల గుళికల మందు చల్లుకోవాలి.
- నాట్లు వేశాక 20 రోజులకు ఎకరానికి 8–10 కిలోల వాసన రాని గుళికల మందు వేసుకోవాలి.
- ఆకుముడత తెగులు నివారణకు కోలరోపైరిపాస్ లేదా మోనా క్రొటోపాస్ మందు పిచికారీ చేసుకోవాలి.
- దోమపోటు నివారణకు ఇమిడా క్లోరోఫిడ్, అగ్గి తెగులు నివారణకు ట్రై సోక్లోజోన్ మందులను పిచికారీ చేసుకోవాలి.
- ఈ మందులన్నీ సూచించిన మోతాదు మేరకే వాడాలి.

### అందుబాటులో ఎరువులు



రైతులు అధిక మోతాదులో ఎరువులు వాడుతున్నారు. దీంతో అనర్థాలు ఎక్కువ. యూరియా ఎక్కువగా వాడడంతో పైరు ఏపుగా పెరిగి పచ్చగా మారడంతో పంటను ఆశించే పురుగులు, చీడపీడల శాతం పెరిగి దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటు ఉంచాం.

– రాజారత్నం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

# సంజీవనిలా 108

- ప్రాణరక్షకులుగా సిబ్బంది
- అత్యవసర సమయాల్లో మెరుగైన సేవలు



108లో ప్రసవం చేసిన సిబ్బంది (ఫైల్)

తాండూరు రూరల్‌: దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకువచ్చిన 108 అంబులెన్స్ పథకానికి నేటికీ ఆదరణ కొనసాగుతోంది. ఆపదలో ఉన్న వారికి అంబులెన్స్ సిబ్బంది ప్రాణరక్షకులుగా నిలుస్తున్నారు. ఎక్కడ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకున్నా మొదట గుర్తుకువచ్చేది 108. ప్రమాదం చూసిన వారు తొలి స్పందనగా 108 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇస్తున్నారు. క్షతగాత్రులకు ప్రథ మ చికిత్స అందించడంతో రోగులను ఆస్పత్రులకు తరలిస్తున్నారు. దీంతో అంబులెన్స్ ప్రజలకు సంజీవనిగా నిలుస్తోంది. దేశంలోని 16 రాష్ట్రాల్లో ఈ పథకం అమలవుతోంది.

**అత్యవసర సేవలు**

108 అంబులెన్స్ వాహనంలో అత్యవసర సేవలు అందుతున్నాయి. శిక్షణ పొందిన ఈఎంటీ, పైలెట్ అందుబాటులో ఉంటారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 108 సిబ్బంది వచ్చి అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అందించిన తర్వాత సమీపంలోని ఆస్పత్రులకు తరలిస్తుంటారు. వాహనంలో ఏఈడీ పరికరం, గుండె చికిత్సకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంటాయి. ఆక్సిజన్ పరికరాలు, ఆక్సీమీటర్, పురుగు మందు తాగితే కక్కించే యత్రం ఉంటాయి.



**జిల్లాలో 15 నెలలుగా అందించిన సేవలు**

| | |
|---|---|
| మెడికల్ కేసులు | 20,407 |
| గర్భిణులు | 5,424 |
| యాక్సిడెంట్ | 1,872 |
| గుండె నొప్పి | 771 |
| బ్రీతింగ్ సమస్యలు | 983 |

**గర్భిణి కేసులు ఎక్కువ**

108కు వచ్చే ఫోన్‌కాల్స్‌లో గర్భిణులకు సంబంధించినవే ఎక్కువ. మారుమూల ప్రాంతాల్లోని గ్రామాలు, తండాల నుంచి గర్భిణులకు తాండూరు మాతాశిశు ఆస్పత్రికి తరలిస్తుంటారు. వాహనంలోనే సుఖ ప్రసవాలు చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.

### ఉద్యోగంతో సంతృప్తి



12 ఏళ్లుగా పని చేస్తున్నా. ఈ ఉద్యోగం కత్తి మీద సాము లాంటిది.రాత్రి, పగలు తేడా లేకుండా విధులు నిర్వర్తించాలి. ఫోన్ కాల్ వచ్చిన క్షణాల్లో ప్రమాద స్థలానికి చేరుకోవాలి. వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులకు వివరిస్తూ ఆస్పత్రికి తరలిస్తాం. ఇందుకు పైలెట్ల సహకారం మరవలేనిది. ఈ ఉద్యోగం ఎంతో సంతప్తినిస్తోంది.

– నర్సింలు, ఈఎంటీ, పెద్దేముల్

### ప్రాణాలు కాపాడడమే కర్తవ్యం



కాల్ వచ్చిన వెంటనే లోకేషన్ నుంచి 30 సెకండ్లలోపు వాహనం బయలుదేరుతుంది. జిల్లాలో 17 వాహనాలున్నాయి. అంబులెన్స్‌లను నిత్యం తనిఖీ చేస్తున్నాం. మందులు, పరికరాలు అందుబాటులో ఉంచాం. ప్రమాదం జరిగిన వెంటనే వెళ్లి క్షత్రగాత్రులకు అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స నిర్వహిస్తాం. వారి ప్రాణాలు కాపాడమే మా కర్తవ్యం.

– శ్రీకాంత్, జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్

# మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

## అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో స్పీకర్ ప్రసాద్‌కుమార్



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ప్రసాద్‌కుమార్, అద్దంకి దయాకర్, ప్రొఫెసర్ కాసిం తదితరులు

మర్పల్లి: మహనీయుల ఆశయాల సాధనకు వారి అడుగుజాడల్లో నడవాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాసింతో కలిసి పట్లూరు ఏర్పాటు చేసిన 16 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ నేటి వాస్తవానికి ప్రతీక అన్నారు. దళిత, గిరిజన, బహుజనుల ధైర్యం ఆపేరు అని కొనియాడారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో తమ వాటాను పొందుతూ, ప్రజాప్రతినిధులు అవుతున్నారంటే అందుకు కారణం అంబేడ్కర్ అందించిన రిజర్వేషన్ల ఫలమే అన్నారు. తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఉన్నంత కాలం దళిత, గిరిజన, బహుజనలకు ఏ లోటూ ఉండదన్నారు. అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. దేశ చరిత్రలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మన దేనని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్ యాదవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, నాయకులు రాములు యాదవ్, కృష్ణారెడ్డి, కొండల్ రెడ్డి, రవీందర్, రామేశ్వర్, ఫసీయుద్దీన్, సలీం, గణేశ్, సురేశ్, అశోక్, రాజు, అశోక్, రాములు, నందు ప్రకాశ్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పృధ్వీరాజ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష



సాయం చేసిన సీఐ మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న అభ్యర్థి

ఇబ్రహీంపట్నం రూరల్‌: కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పీజీ నీట్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన పరీక్షకు ఇబ్రహీంపట్నంలోని సిద్ధార్థ, శ్రీఇందు, ఏవీఎన్, శ్రీఇందు, గురునానక్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని రాందాస్‌పల్లి సమీపంలో ఉన్న ఏవీఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కోసం 110 మందిని కేటాయించారు. పరీక్ష సమయానికి ముందుగానే చేరుకున్న గాంధీ మెడికల్ కళాశాల నుంచి వచ్చిన డాక్టర్ నితిన్ పొరపాటున ప్రొవిజనల్ సర్టిఫికెట్ మర్చిపోయాడు. పరీక్ష సమయం దగ్గరపడుతుండడం.. సమీపంలో ఎక్కడా జిరాక్స్ కేంద్రాలు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్‌రెడ్డి తన కారు ఇచ్చి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు పంపించి ప్రొవిజనల్ సర్టిఫికెట్ జిరాక్స్ తీసుకొచ్చి ఇచ్చారు. దీంతో నితిన్, ఆయన తల్లిదండ్రులు సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.

# ఛత్రపతిని ఆదర్శంగా తీసుకోవాలి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**



విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న రాంచందర్‌రావు

శంకర్‌పల్లి: హిందూ సామ్రాజ్య స్థాపన కోసం ఛత్రపతి శివాజీ చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. మండలంలోని గోపులారంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఛత్రపతి శివాజీ వ్యక్తిత్వాన్ని, ఆయన పోరాటాలకు సంబంధించిన చరిత్రను చదివి స్ఫూర్తి పొందాలన్నారు. రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. యువత అన్ని మతాల వారిని గౌరవిస్తూనే సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట వీరధర్మాజ స్వామి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ మండలాధ్యక్షురాలు లీలావతి, మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, రాములు, వాసుదేవ్ కన్నా, బయానంద్ తదితరులు పాల్గొన్నారు.

**గెలుపుకోసం కృషి చేయాలి**

మొయినాబాద్‌రూరల్‌: ఎన్నికలు ఎప్పుడు వచ్చిన పార్టీ గెలుపుకోసమే అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. మండలపరిధిలోని అమ్డాపూర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కట్టమైసమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు గొల్లపల్లి రవీందర్ రెడ్డి, నోముల అంజిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, మహేందర్‌ముదిరాజ్, నారంరెడ్డి, బాత్కు శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రక్తదానం.. ఆరోగ్యానికి మంచిది

కొడంగల్ కోర్టు సివిల్ జడ్జి శ్రీరామ్



రక్తదానం చేస్తున్న యువకుడితో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీరామ్

**కొడంగల్:** రక్తదానం చేయడం ఆరోగ్యానికి మంచిదని కొడంగల్ కోర్టు సివిల్ జడ్జి శ్రీరామ్, వికారాబాద్ జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ రవీంద్రా యాదవ్, సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నా రు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం యువసేన ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు 56 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. రక్తదానం చేయడంతో కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందన్నారు. దీంతో శరీర భాగాలు చురుకుగా పని చేస్తాయని చెప్పారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ వారు నిర్వ హించిన పరిశోధనలో రక్తదానం చేసిన వారి జీవిత కాలం నాలుగేళ్లు పెరిగినట్లు తేలిందన్నారు.

### రోడ్లకు మరమ్మతు చేపట్టాలి

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య



లక్ష్మీనారాయణపూర్-యాలాల రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**యాలాల:** మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్-దేవనూరు మార్గంలో అధ్వానంగా మారిన రోడ్డుకు మరమ్మతు పనులను చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కేవీపీఎస్ నాయకులతో కలిసి దెబ్బతిన్న రోడ్డుపై నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం జిల్లాలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. లక్ష్మీనారాయణపూర్-బెన్నూరు మార్గంలో మరమ్మతు పనుల పేరిట గతంలో తవ్వి వదిలేశారని, ఈ ప్రాంతంలో వాహనదారులు అవస్థలు పడుతున్నారన్నారు. అసంపూర్తిగా మారిన రోడ్డు విషయంలో స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవ చూపి మరమ్మతు పనులు చేపట్టేలా చూడాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో యాదప్ప, చిన్న, ఫాజిల్, ఎల్లప్ప, నర్సింలు, పాండుగౌడ్ తదితరులు ఉన్నారు.

### ప్రభుత్వాస్పత్రిలో కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న లయన్ హరినాథ్

**కొడంగల్:** కంటి సమస్యలు ఉన్న వారికి పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రాయాదవ్ అన్నారు. గత నెల 22వ తేదీన కంటి ఆపరేషన్లు చేసిన వారికి ఆదివారం స్థానిక ఆస్పత్రిలో పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. కొన్నేళ్లుగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్యారోగ్య శాఖ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ వైద్య పరీక్షలు చేస్తున్నారు. కంటి ఆపరేషన్లు అవసరం ఉన్న వారిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నారు.

### అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

తిరుపతిలో ప్రత్యక్షం

**పూడూరు:** మండలంలోని మన్నెగూడ కేశవరెడ్డి పాఠశాలలో అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యమైంది. చన్గోముల్ ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కేశవరెడ్డి పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న కె. ఈశ్వర్ (12) ఈ నెల 2న పాఠశాల నుంచి కనిపించకుండా వెళ్లిపోయాడు. ఈ విషయం గురించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పాఠశాల సిబ్బంది ఆరా తీయగా పాఠశాల గోడదూకి పారిపోయినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. దీంతో వారు కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. గోడ దూకి వెళ్లిన విద్యార్థి ఇంటికి రాలేదని, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ విక్రం, విద్యార్థి కుటుంబ సభ్యులు చన్గోముల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి కనిపించకుండ పోయిన విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో తిరుపతి రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులకు దొరికినట్లు తెలిపారు. వారు విద్యార్థినుంచి పూర్తి వివరాలు సేకరించి తిరుపతిలోని కేశవరెడ్డి పాఠశాల బ్రాంచిలో బాలుడిని అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# అవగాహన లేక.. అందిపుచ్చు కోక!

**నానో యూరియా, డీఏపీ వినియోగంపై నీలినీడలు**

- క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారుల అలసత్వం



మోమిన్‌పేటలో తెరిచి ఉన్న వ్యవసాయాధికారి కార్యాలయం



పత్తికి సోకిన పేను బంక తెగులు

**మోమిన్‌పేట:** వ్యవసాయంలో యూరియాకు బదులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సూచిస్తున్నా దాని అమలుకు క్షేత్రస్థాయిలో పరిస్థితులు అనుకూలంగా లేవు. కేంద్ర సర్కారు రెండేళ్ల క్రితమే ప్రతిష్టాత్మకంగా నానో యూరియా, నానో డీఏపీలను(ద్రవ రూపం) విడుదల చేసినా దానిపై అవగాహన కల్పించడంలో యంత్రాంగం విఫలమైంది. దీని ఫలితంగా ప్రస్తుతం రైతులు యూరియా బస్తాల కోసం ఫర్టిలైజర్ షాపుల ఎదుట బారులు తీరుతున్న ఘటనలు ఉన్నాయి. నానో యూరియాపై సమగ్రంగా అవగాహన కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి.

**పంటలకు సోకిన తెగుళ్లు**

పత్తిలో వచ్చే తెగుళ్లు, పేను బంక, నల్ల, తెల్ల పేనులు వచ్చి పంటను ఎదగకుండా నాశనం చేస్తుంటే రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించడం మానేసి ఎరువుల షాపులను ఆశ్రయిస్తున్నారు. వ్యవసాయాధికారులు పంటలపై వచ్చే తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించడం లేదని స్పష్టంగా తెలుస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. నిత్యం ఏదో ఏ పని ఉందని కార్యాలయాలు మాత్రం దాటడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయాధికారులు విత్తనాలు విత్తు కొన్నది మొదలు పొలం బాట పట్టితే రైతుల సమస్యలు అర్థమవుతాయని అంటున్నారు. గత వారంలో అధికంగా కురిసిన వర్షాలకు పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. దీంతో కొన్ని పంటలకు తెగుళ్లు సోకగా రైతులు మందుల దుకాణం యాజమానులను సంప్రదించారు.

**రైతుల ఆగ్రహం**

ముఖ్యంగా యూరియా కోసం నిత్యం రైతులు ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. నానో యూరియా, నానో డీఏపీలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు కార్యాలయాలు దాటడం లేదు. రవాణా ఖర్చు, దూర భారం, ఏ మందులోనైనా కలిపి పిచికారీ చేసుకోవడం, ఒక బస్తా యూరియాకు ఒక లీటరు నానో యూరియా సమానమని రైతులకు అవగాహన కల్పిస్తే ఇబ్బందులు తప్పుతాయి. కానీ అధికారులు ఆ విధంగా ఆలోచించడం లేదని ఆరోపణలున్నాయి. ఎప్పుడు చూసిన వ్యవసాయాధికారులు కార్యాలయంలోనే ఉండటాన్ని రైతులకు ఆగ్రహం తెప్పిస్తుంది. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు పొలం బాట పట్టి రైతుల సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించాలని కోరుతున్నారు.

# ఏం కొనలేం... ఏం తినలేం!

**భారంగా కూరగాయల ధరలు**

- ఇబ్బందుల్లో వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు



కూరగాయలు అమ్ముతున్న వ్యాపారి

**దౌల్తాబాద్:** రోజురోజుకు కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. దీంతో వినియోగదారుల పరిస్థితి కొనలేం..తినలేం అనట్టుగా మారింది. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలను పెరుగుతున్న ధరలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కూరగాయల సాగు తగ్గిపోవడంతో సప్లయ్ తగ్గింది. మార్కెట్లో డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. అందునా వ్యాపారులు ఇదే అదనుగా భావించి ధరలు రెండింతలు పెంచి అమ్ముకుంటున్నారు. దీంతో పేదలు ఎక్కువగా కూరగాయలు కొనలేని పరిస్థితిలో ఉన్నారు. రూ.200లతో మార్కెట్‌కు వెళ్తే నాలుగు రకాల కూరగాయలే వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలతో ప్రస్తుతం పప్పు, చింతపండుతో సరిపెట్టుకోవలసి వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో పెళ్లిళ్లు, పూజల నేపథ్యంలో కూరగాయల వంటలకే ప్రాధాన్యం ఉంటుంది. దీంతో రేట్లు పెరిగే అవకాశం కూడా ఎక్కువే. ఈ విషయంలో అధికారులు స్పందించి రైతు బజార్‌లలో దళారులు, వ్యాపారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల వద్ద కొనుగోలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**ధరలు ఇలా..**

కిలో మిర్చి రూ.100, టమాట 40, బీరకాయ 80, దొండకాయ 80, బెండకాయ 80, గోబిపువ్వు 100, వంకాయ 80, ఆలు 60, కిలోచిక్కుడుకాయ రూ.80లుగా అమ్ముతున్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**కొత్తూరు:** రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు దూబే.. పదేళ్లుగా కొత్తూరులో నివాసం ఉంటున్నాడు. ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంటినుంచి వెళ్లిపోయిన సదరు వ్యక్తి.. గుర్తు తెలియన రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ మాస్టర్ రేమత్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**నందిగామలో..**



దూబే(ఫైల్)

**నందిగామ:** బహిర్భూమికి వెళ్లిన వ్యక్తిని రైలు ఢీకొట్టగా.. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన నందిగామ శివారు హెచ్‌బీఎల్ పరిశ్రమ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఐజాక్ తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి మండలం కడ్లాపూర్ గ్రామానికి చెందిన దాడువై అంజయ్య(57) కాలకృత్యాలు తీర్చుకునేందుకు రైలు పట్టాల పక్కకు వెళ్లి తిరిగి వస్తుండగా.. గుర్తు తెలియని రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ మాస్టర్ ఎండీ ఉబెద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

## ఫోన్ అప్పగింత

**మహేశ్వరం:** 108లో మరిచిన మొబైల్ ఫోన్‌ను.. అంబులెన్స్ సిబ్బంది రోగి బంధువుకి అప్పగించి నిజాయతీని చాటుకున్నారు. కందుకూరు మండలం మీర్కాన్‌పేట్ గ్రామానికి చెందిన నందిగామ లక్ష్మమ్మ(75) అనారోగ్యానికి గురి కావడంతో బంధువులు అంబులెన్స్‌లో చికిత్స కోసం తరలించారు. ఆస్పత్రికి తరలించే క్రమంలో రోగి బంధువులు.. తమ ఫోన్‌ను వాహనంలో వదిలి వెళ్లిపోయారు. మండల కేంద్రం చేరుకున్న వాహన సిబ్బంది.. సెల్‌ను గమనించి రోగి బంధువులకు సమాచారం అందించి అప్పగించారు. దీంతో ఈఎంటీ కుమార్, పైలట్ యాదయ్యను వారు అభినందించారు.




రోగి బంధువుకు ఫోన్ అందజేస్తున్న 108 సిబ్బంది

## పోగొట్టుకున్న డబ్బును కెమెరా పట్టించింది

**ఆమనగల్లు:** ఓ వ్యక్తి పోగొట్టుకున్న పర్సును సీసీ కెమెరా పట్టించగా.. ఆ పర్సును పోలీసులు ఆదివారం బాధిత వ్యక్తికి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. తలకొండపల్లికి చెందిన లక్ష్మయ్య తన పర్స్‌లో రూ.16 వేలు పెట్టుకుని, గ్రామీణ వికాస్‌బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు వెళ్తుండగా.. మార్గమధ్యలో పడిపోయింది. బ్యాంక్‌కు వచ్చి చూసుకోగా.. కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. సదరు వ్యక్తి ఫిర్యాదుతో ఎస్‌ఐ శ్రీకాంత్ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ శ్రీనివాస్, శివుడులు ఆయా మార్గంలోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. రోడ్డుపై పడిపోయిన పర్స్‌ను బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తీసుకున్నట్లుగా గుర్తించారు. బైక్ నంబర్ ఆధారంగా వారిని గుర్తించి, పర్సు, అందులోని డబ్బును రికవరీ చేశారు. అనంతరం బాధితుడు లక్ష్మయ్యకు అందజేశారు.

## జాలీగా.. అ'పూర్వ' కలయిక



**శంషాబాద్:** మూడు దశాబ్దాల క్రితం పదో తరగతి చదువుకున్న అలనాటి స్నేహితులంతా ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కలిశారు. నాటి స్నేహితులు ఒకే చోటి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని మురిసిపోయారు. శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993వ సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఎంజాయ్ చేశారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇటీవల ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన తమ తోటి స్నేహితుడు సంకూరి జయప్రకాశ్‌ను ఘనంగా సన్మానించారు. శారీక వైకల్యంతో బాధపడుతున్న మరో స్నేహితుడు భాస్కరాచారికి ఆర్థికంగా సాయం అందజేసి మేమున్నామంటూ భరోసానిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది ఎస్.వెంకట్‌రెడ్డి, డాక్టర్ ఎ.కృష్ణ, భాగ్యలక్ష్మి, ఎన్.వరలక్ష్మి, సరిత, రజిత, బి.వరలక్ష్మి, పద్మావతి, ఎస్.కిరణ్, మహ్మద్ ఆసిఫ్, లక్ష్మణ్‌ప్రసాద్, టి.నర్సింహ, చందు, మహేందర్, దాసు, సురేష్, సాయిబాబా, సత్యనారాయణ, యూసుఫ్, నర్సింగ్‌రావు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

### రిజర్వేషన్ల సాధనకు బీసీలు కదిలిరండి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి హన్మంతుముదిరాజ్

**పరిగి:** కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తుంటే కేంద్రం అడ్డుకుంటోందని కేంద్రంపై కొట్లాడేందుకు బీసీలు కదిలి రావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి హన్మంతుముదిరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర కేబినెట్ బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్‌కు పంపిస్తే బీజేపీ అడ్డుకుంటోందన్నారు. ఈ నెల 5,6,7 తేదీల్లో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంపై కొట్లాడి బీసీ రిజర్వేషన్లు సాధించుకునేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. రాష్ట్రంలోని బీసీలు ప్రభుత్వానికి మద్దతు తెలిపి నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

### చికిత్సపొందుతూ సీఆర్పీఎఫ్ జవాన్ మృతి

**కుల్కచర్ల:** చికిత్సపొందుతూ సీఆర్పీఎఫ్ జవాన్ మృతి చెందిన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం ..కుల్కచర్ల గ్రామానికి చెందిన తమ్మలి అనంతయ్య(50) మణిపూర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. 4నెలల క్రితం అనారోగ్య సమస్యలతో సెలవులపై స్వగ్రామానికి వచ్చారు. శనివారం ఉదయం స్నానం చేసేందుకు వెళ్లి జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. దీన్ని గమనించిన కుటుంబీకులు వెంటనే మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు చంద్రాయణగుట్టకు రిఫర్ చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉస్మానియాకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు.

### పెళ్లికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

16 తులాల బంగారు నగల అపహరణ

**మొయినాబాద్:** వివాహ వేడుకలో పాల్గొని వచ్చేసరికి గుర్తుతెలియని దుండగులు ఇంటిని గుల్ల చేశారు. ఇంటి తాళాలు, బీరువా తాళం పగులగొట్టి 16 తులాల బంగారు నగలు దోచుకెళ్లారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధి పెద్దమంగళారంకు చెందిన సీహెచ్ అనిత, శనివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలిసి వనస్థలిపురంలోని బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా.. తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడుంది. బీరువాలోని బంగారు నగలు కనిపించలేదు. చోరీ జరిగిందని భావించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా.. క్లూస్‌టీమ్‌తో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### గృహిణి అదృశ్యం

**పహాడీషరీఫ్:** కుమారుడితో గృహిణి అదృశ్యం అయింది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ ఇస్తియాక్ అన్సారీ, నజీరా కాతూన్(25) దంపతులు ముగ్గురు పిల్లలతో కలిసి జీవనోపాధి నిమిత్తం జల్‌పల్లి వాదే ముస్తాఫా బస్తీకి వలసవచ్చారు. ఈ నెల 2న అందరితో కలిసి నిద్రపోయిన నజీరా.. ఉదయం లేచి చూసే సరికి నాలుగు నెలల కుమారుడు జీషాన్‌తో కలిసి కనిపించకుండా పోయింది. అదే రోజున భర్త అన్సారీ.. ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో కానీ, 87126 62367 నంబర్‌కు కానీ సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# సమానత్వమే సనాతన ధర్మం

**శ్రీమాణికేశ మహాసంస్థానం ఆశ్రమ పీఠాధిపతి శంకర్ స్వామీజీ**



అంబేడ్కర్ నగర్ సేవా బస్తీలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న శంకర్ స్వామీజీ

**తాండూరు టౌన్:** సమానత్వమే సనాతన ధర్మమని శ్రీమాణికేశ మహాసంస్థానం ఆశ్రమ పీఠాధిపతి, విశ్వహిందూ పరిషత్ ప్రాంత సామాజిక సమరసత మార్గదర్శకులు శ్రీ శంకర్ స్వామీజీ అన్నారు. ఆదివారం ఆయన తాండూరు పట్టణంలోని అంబేడ్కర్ నగర్ సేవా బస్తీ, దళిత వాడలోని మునింగం లాలప్ప గృహంలో రుద్రాభిషేకం, మహా హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం అడ్డు గోడలను కూలుస్తూ, హిందువులను ఏకం చేయడం కోసం, అందరిలో సోదర భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. గడప లోపలే కులం, గడప దాటితే హిందూ బంధువులం అనే భావనను ప్రజలంతా కలిగి ఉండాలన్నారు. ప్రజల్లో మార్పు తీసుకురావడానికి, అందరిలో ఆధ్యాత్మిక భావనను జోడించేందుకే ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన వివరించారు. అనంతరం దంపతులకు శివలింగం, సంస్థానం తరుపున అమ్మవారి వస్త్రాలు అందజేశారు. రక్షాబంధన్‌ను పురస్కరించుకుని బస్తీలో రాఖీలు కట్టారు.

## ఇంటి దొంగ పనేనా!

- పోలీసులకు సవాల్‌గా మారిన చోరీ కేసు
- సందేహాలెన్నో

**నందిగామ:** ఇటీవల ఓ ఇంట్లో జరిగిన భారీ చోరీపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేరన్నట్లు.. నాలుగో వ్యక్తికి తెలియకుండా దాచిన నగదు, నగలు.. ఇంట్లో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. కొత్త వ్యక్తి లోపటికి రాలేదు. భద్రపర్చిన పెట్టె ఎక్కడ ఉందో అక్కడే ఉంది. కానీ అవి మాయం అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నందిగామ మండలం మామిడిపల్లి గ్రామంలో చాకలి కృష్ణయ్య.. కూతురు వివాహం కోసమని ఇంట్లో రూ.15 లక్షల నగదు, 16 తులాల బంగారం దాచి ఉంచాడు. జూలై 27న డబ్బులు అవసరం ఉండి పెట్టిన చోటకు వెళ్లి చూడగా.. డబ్బు, నగలు కనిపించలేదు. ఆందోళన చెందిన సదరు వ్యక్తి.. కుటుంబ సభ్యులు, బంధువుల వివరించారు. ఎంత వెతికినా వాటి ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే.

**అనుమానాలు ఎన్నో..**

బాధితుడు కృష్ణయ్య.. భార్య, కూతురుతో నివాసం ఉంటున్నాడు. భార్య కూలీ పనులకు వెళ్తుండగా, కృష్ణయ్య అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్నాడు. తోడుగా కూతురు ఉంటోంది. ఇంట్లో నగదు, నగలు దాచిన విషయం మా ముగ్గురికి మాత్రమే తెలుసునని, తలుపులు, ఇంటి తాళం విరగగొట్టిన దాఖలాలు లేవని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సొత్తు ఉంచిన పెట్టె ఎప్పటిలాగే సజ్జపైనే ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో చడిచప్పుడు లేకుండా.. నగదు, నగలు మాయం కావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు విచారణ ముమ్మరం చేసినప్పటికీ.. ఎటూ తేల్చలేక పోతున్నారు. కాగా.. ఈ కేసులో కేశంపేట మండలం పరిధి ఓ గ్రామానికి చెందిన యువకుడి పాత్ర ఉందనే అనుమానంతో ఆ దిశగా పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా.. మామిడిపల్లిలో జరిగిన చోరీ ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది. ఎన్ని విధాలుగా పరిశీలించినా.. అనుమానాలన్నీ కుటుంబ సభ్యుల చుట్టే తిరుగుతుండటం విశేషం.

## రిజర్వేషన్లు ప్రకటించకపోతే ఎన్నికల బహిష్కరణ

**బీసీసేన జాతీయ అధ్యక్షుడు**

**షాద్‌నగర్‌రూరల్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించకపోతే సర్పంచ్ ఎన్నికలను బహిష్కరిస్తామని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్కకృష్ణ యాదవ్ అన్నారు. ఆదివారం సేన ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు షాబాద్ రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో లింగారెడ్డిగూడ గ్రామ సేన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. జనాభాలో బీసీలు అధిక శాతం ఉన్నారని, రిజర్వేషన్లలో సముచిత స్థానం కల్పించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామని పేర్కొన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శంకరయ్య యాదవ్, ఉపాధ్యక్షులుగా అశోక్, మల్లేశ్, వంశరాజ్, ప్రధాన కార్యదర్శులుగా వీరేష్‌గౌడ్, పోచయ్య, శ్రీకాంత్‌తో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్, చంద్రశేఖరప్ప, పాలాది శ్రీనివాస్, జయమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి

**మేయర్ గద్వాల విజయలక్ష్మి**



కర్మాగారం ప్రారంభోత్సవంలో మేయర్ విజయలక్ష్మి

**షాబాద్:** పరిశ్రమల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. షాబాద్ మండలం చందనవెల్లి పారిశ్రామిక వాడలో నీలోఫర్ బాబురావు ఏర్పాటు చేసిన నీలోఫర్ టీ పౌడర్ ప్యాకింగ్ కర్మాగారాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అనేక ప్రోత్సాహకాలను అందజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ టీసీ అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, లింగం, నాయకులు అశోక్, రాఘవేందర్, నర్సింహారెడ్డి, సూర్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ కాల్‌తో స్పందించారు.. బాలికను కాపాడారు..

- ఒడిశా నుంచి సమాచారం
- అప్రమత్తమై బాలికను కాపాడిన బాచుపల్లి పోలీసులు



బాలికతో పోలీస్ సిబ్బంది

**నిజాంపేట్:** బాచుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్‌కు శనివారం ఒడిశాలోని కటక్ నుంచి ఓ ఫోన్ వచ్చింది. దక్షిణాసియా మహిళా ఫౌండేషన్‌లో ప్రోగ్రాం ఆఫీసర్‌గా పని చేస్తున్న తాన్వి సింగ్ అనే వ్యక్తి ఫోన్ చేసి ఒడిశా రాష్ట్రం, కేంద్రపాడా జిల్లా, ఔల్ మండలం, సహిరా గ్రామానికి చెందిన బాలిక(16) అపహరణకు గురైందని, ఆమెను బాచుపల్లిలోని ఓ ఇంట్లో నిర్బంధించినట్లు సమాచారం అందించాడు. దీంతో తక్షణమే స్పందించిన ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ గాలింపు చర్యలు చేపట్టారు. స్థానికుల సహకారంతో కొద్ది గంటల్లోనే బాలికను ఇందిరానగర్‌లోని ఓ ఇంట్లో బంధించినట్లు గుర్తించి రక్షించారు. అనంతరం ఆమెను నూరారంలోని సఖి సెంటర్‌కు తరలించారు. ఆమె తలిదండ్రులు లేదా ఒడిశా పోలీసులకు అప్పగించే వరకూ తాత్కాలిక రక్షణలో ఉంచనున్నట్లు ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు.

## యూట్యూబ్‌లో వీడియోలు బ్లాక్ చేశారని ఫిర్యాదు

**నిందితుడిపై కేసు నమోదు**

**బంజారాహిల్స్:** తాము పాట రాసుకుని పాడి వీడియోలు చిత్రీకరించుకుని రూ. లక్షలు ఖర్చు చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలను మహరాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి తమకు తెలియకుండా డౌన్‌లోడ్ చేసుకుని తమ వీడియోను బ్లాక్ చేశారంటూ ఐదుగురు యూట్యూబర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2 జవహర్‌కాలనీకి చెందిన రమావత్ విజయ్ అనే యూట్యూబర్..విజయ్ ఆడియోస్ అండ్ వీడియోస్ పేరుతో తానే పాటలు పాడి వీడియో చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుంటాడు. అతడికి 6 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. అయితే మహరాష్ట్రకు చెందిన విశాల్‌రాథోడ్ అనే వ్యక్తి విజయ్ అప్‌లోడ్ చేసిన వీడియోలను డౌన్‌లోడ్ చేసుకుని తానే వీటిని రూపొందించినట్లుగా ఫ్రెష్‌గా యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి విజయ్ వీడియోలను బ్లాక్ చేశాడు. విజయ్‌తో పాటు బనావత్ ఆంజనేయులు, అరవింద్, రమావత్ నితిన్, సాయికుమార్ అనే యూట్యూబర్ల వీడియోలు కూడా డౌన్‌లోడ్ చేసుకుని వీటిని బ్లాక్ చేసి తానే వీటిని నిర్మించినట్లుగా విశాల్ రాథోడ్ అప్‌లోడ్ చేయసాగాడు. దీంతో అసలైన యూ ట్యూబర్లు నష్టాలు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని విశాల్ దృష్టికి తీసుకెళ్లగా తిరిగి వీడియోలు అప్‌లోడ్ కావాలంటే అన్‌లాక్ చేసేందుకు రూ.10 లక్షలు డిమాండ్ చేస్తున్నాడని, తమను బెదిరింపులకు గురిచేస్తున్నాడంటూ విజయ్‌తో పాటు నలుగురు యూట్యూబర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది కాపీరైట్ చట్టం కిందికు కూడా వస్తుందని, చీటింగ్ చేయడమేగాక, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నాడని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక్కో వీడియో చిత్రీకరించడానికి రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేశామని, తమ వీడియోలను బ్లాక్ చేయడం ద్వారా భారీగా నష్టపోతున్నామని ఆరోపించారు. విశాల్‌పై బంజారాహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.